
ప్రజాశక్తి

బుధవారం 17 డిసెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం



ఎస్‌సి, ఎస్‌టిలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పాలకొండ

ఎస్సీ, ఎస్టీలకు గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సబ్ కలెక్టర్ స్వప్నల్ పవార్ జగన్నాథ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ లెవెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ సమస్యలు కూడా తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడ ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే జయకృష్ణ, డిఎస్‌పి ఎం.రాంబాబు, స్థానిక తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎంపిడిఒ ఎంవి రంగారావు తదితరులు ఉన్నారు.

ఏనుగుల నుంచి విముక్తి కలిగేనా?

- గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్‌లో తాత్కాలిక నివాస కేంద్రం
- సంక్రాంతి నాటికి జిల్లాకు కుంకీ ఏనుగులు
- ఆశగా ఎదురు చూస్తున్న ప్రజలు



ఏనుగుల కోసం నిర్మించిన షెడ్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాను గత కొంతకాలంగా పట్టి పీడిస్తున్న ఏనుగుల బెడద నుంచి మరి కొద్ది నెలల్లో విముక్తి కలగనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 12ఏనుగులు తిరుగుతూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. భామిని మండలంలో నాలుగు ఏనుగులు, కొమరాడ, కురుపాం మండలాల్లో మరో 8 ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఒడిశాలోని లఖేరీ వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రం నుంచి తప్పిపోయి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులు ఏడేళ్లుగా జిల్లాను వెంటాడుతూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మన్యం ఏజెన్సీ ప్రాంతం వున్నప్పటి నుంచి ఏనుగుల బెడద కనిపిస్తోంది. జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులు పగటి పూట నిద్రపోతూ రాత్రి వేళల్లో సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తుతున్నాయి. ఏనుగులు గంటకు 62నుంచి 70కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. జిల్లాలో గల ఏనుగులకు అనువైన వాతావరణం, ఆహారం, నీరు పుష్కలంగా లభిస్తుండడంతో ఈ ప్రాంతాన్ని వదిలి పెట్టడం లేదు. మొక్కజొన్న, వరి, అరటి తోటలతో పాటు మర్రి, రావి చెట్ల ఆకులను ఆహారంగా తీసుకుంటాయి. నీరు, ఆహారం కొరత ఏర్పడితే అవి జిల్లాని వీడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ పుష్కలంగా ఆహారానికి కావాల్సిన పంటలు, నీరు దొరుకుతున్న నేపథ్యంలో జిల్లాను వీడని నీడలా వెంటాడుతున్నాయి.

కుంకీల రాకతో ఏనుగుల బెడదకు చెక్

జిల్లాలో విధ్వంసం సృష్టిస్తున్న ఏనుగుల బెడదకు కుంకీ ఏనుగులతో చెక్ పెట్టాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. జిల్లాలో ఉన్న ఏనుగుల బెడద నుంచి విముక్తి పొందాలంటే ప్రభుత్వం ముందు అటవీశాఖ అధికారులు రెండు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఏనుగుల కోసం ప్రత్యేకంగా జోన్ ఏర్పాటు చేయడం లేదా కుంకీ ఏనుగులతో చెక్ పెట్టి జిల్లా నుంచి వేరొక ప్రాంతానికి తరలించడమే మార్గంగా అధికారులు ప్రతిపాదించారు. ఏనుగుల జోన్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు లేని కారణంగా కుంకీ ఏనుగులతో మచ్చిక చేసుకొని జిల్లా నుంచి ఏనుగులను తరలించడమే ఉత్తమమని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఏనుగుల కోసం తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ భూములు 400 హెక్టార్లలో వున్నాయి. దీనిలో వంద హెక్టార్లలో ఏనుగుల తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి నుంచే పనులు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రం ఏర్పాటుకు రూ.3కోట్లు నిధులు మంజూరు కావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కేంద్రంలో కుంకీ ఏనుగులతో జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. తాత్కాలిక నివాస కేంద్రం చుట్టూ సోలార్ విద్యుత్ ఫెన్సింగ్‌తో ట్రెంచ్ ఏర్పాటు చేయడం, నివాసానికి షెడ్ల నిర్మాణం, తాగునీటి కుంటలు, స్నానానికి నీటి కొలనుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదే విధంగా ఏనుగుల కోసం తాత్కాలిక నివాస కేంద్రంలో ఆహార పంటలు పండిస్తున్నారు. మొక్కజొన్న, ఎలిఫెంట్ గ్రాస్, నేపియర్ గ్రాస్, అరటి, మర్రి, రావి, పనస చెట్లను పెంచుతున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి జిల్లాకు కుంకీ ఏనుగులు రానున్నాయని ఇటీవల జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిఆర్‌సీ సమావేశంలో ప్రకటించారు. తాత్కాలిక నివాస కేంద్రాన్ని డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్‌తో ప్రారంభిస్తామని చెప్పారు. కుంకీ ఏనుగుల సంరక్షణ, వాటికి శిక్షణ ఇచ్చే మావటీలు, పశువైద్య సిబ్బంది, వన్య ప్రాణుల సంరక్షణ నిపుణుల సమక్షంలో తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ కేంద్రం లో సిబ్బంది నివాసానికి గదులు, వంట గదులను నిర్మిస్తున్నారు. దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే కర్నాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకొచ్చి చిత్తూరు జిల్లా పల్లమనేరులో శిక్షణ ఇస్తున్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి కుంకీ ఏనుగుల రాకకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అంతా అనుకున్న విధంగా జరిగితే జిల్లాలోని ఏనుగలను కర్నూలు జిల్లా శేషాచలం అడవులు లేదా ఒడిశాలోని లఖేరి వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రానికి తరలించాలనే యోచనలో వున్నారు.

ఆస్తి, ప్రాణనష్టాలతో జనం బెంబేలు

జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల వల్ల ఆస్తి, ప్రాణనష్టాలు పెరుగుతూ వున్నాయి. ఇంతవరకు జిల్లాలో 13మంది ఏనుగులు దాడుల్లో మృతి చెందారు. వీరిలో ఇద్దరు అటవీ శాఖ ట్రాకర్లు కూడా వున్నారు. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం సకాలంలో అందజేయడంలో అటవీశాఖ అధికారులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.5లక్షలు పరిహారంగా పంపిణీ చేశారు. ఒకరికి మాత్రమే పది లక్షల పరిహారం అందజేశారు. పంపిణీ చేసిన పరిహారంలో సగం నగదు రూపంలో, మిగిలిన సగం పిల్లల పేరిట డిపాజిట్ చేస్తున్నారు. అదే విధంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టానికి పరిహారం కింద ఇంతవరకు వంద మంది రైతులకు రూ.68లక్షలు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు ఏనుగుల కారణంగా 700 హెక్టార్లలో పంటనష్టం జరిగినట్లు అంచనా వేశారు. మరో 60మంది రైతులకు సంబంధించిన రూ.7.73లక్షల పరిహారం చెల్లించాల్సి ఉంది. పంటనష్టం అంచనా వేయడంలో వ్యవసాయ, రెవిన్యూ అధికారుల అలసత్వం కారణంగా బాధిత రైతులకు పరిహారం అందడంలో కొంత జాప్యం జరుగుతోంది.

చివరిదశలో తాత్కాలిక నివాస కేంద్రం పనులు



ఏనుగుల తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటు పనులు చివరిదశలో ఉన్నాయి. జనవరి 17 నాటికి జిల్లాకు కుంకీలు వస్తాయని భావిస్తున్నాం. కుంకీ ఏనుగులు జిల్లాకు వచ్చిన తర్వాత మొదట భామిని మండలంలోని నాలుగు ఏనుగులతో మచ్చిక చేసి వాటిని తాత్కాలిక నివాస కేంద్రానికి తరలించేందుకు చర్యలు చేపడతాం. వాటికి పశు వైద్య నిపుణులు, వన్య ప్రాణుల సంరక్షణ నిపుణుల సమక్షంలో తగిన మోతాదులో మత్తు మందు ఇచ్చి లారీల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేయనున్నాం. కొమరాడ మండలంలోని 8 ఏనుగుల్లో కొన్ని చిన్న పిల్లలు వున్నాయి. వాటి తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉన్నతాధికారులు, నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కుంకీ ఏనుగులు వచ్చిన తర్వాత తాత్కాలిక నివాస కేంద్రం నిర్వహణ కయ్యే ఖర్చుకు నిధులు మంజూరు కావాల్సి ఉంది.

జిఎస్ ప్రసూన,
జిల్లా అటవీశాఖ అధికారి, పార్వతీపురం



ట్రక్‌షీట్‌ను పరిశీలిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్

మిల్లర్లు ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదు : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస

ధాన్యం కొనుగోలులో రైతులను మిల్లర్లు ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదని సంయుక్త కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం పార్వతీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మ వలస, కురుపాం మండలాల్లోని పలు గ్రామాల్లో జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం మండలం కోటవానివలసలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ట్రక్ షీట్ ప్రక్రియను పరిశీలించారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తగిన నగదు వారికి వచ్చేలా ట్రక్ షీట్‌లో వివరాలను పొందుపర్చాలన్నారు. ఆర్‌ఎస్‌కెల్లో సిబ్బంది అత్యంత చురుగ్గా పనిచేయాలని, ప్రతి వాహనానికి జిపిఎస్ ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం గరుగుబిల్లి మండలం ఖడ్గవలస వద్ద గల సంతోషపురం రైస్ మిల్లును సందర్శించిన జేసీ మిల్లర్లకు పలు మార్గదర్శకాలు, సూచనలు జారీచేశారు. మిల్లర్లు రైతులకు ఇబ్బందులు పెట్టి తక్కువ ధరకు విక్రయించాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని అన్నారు. జియ్యమ్మవలసలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో ముచ్చటించి విద్యా ప్రమాణాలను గమనించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో జెసి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహారాన్ని అందించాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత ఎంత అవసరమో అదేవిధంగా విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కూడా అవసరమని అన్నారు. అదే గ్రామంలోని పిహెచ్‌సిని సందర్శించిన జెసి రిజిస్టర్లను తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందులను ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని తెలిపారు. అదే మండలం అల్లువాడలోని పిపిసి, ఆర్‌ఎస్‌కెలను సందర్శించారు. రైతులు ఆర్‌ఎస్‌కెలకు తెచ్చిన ధాన్యానికి ధ్రువీకరణ ఇవ్వకపోతే అధికారులపై చర్యలు ఉంటాయని కలెక్టర్ అన్నారు. రైతు సేవ కేంద్రాల ఇన్‌ఛార్జులు నేరుగా మిల్లరు యజమానులు లేదా కస్టోడియం అధికారులతో మాట్లాడాలన్నారు. గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. గోనె సంచులు కొరత ఉందని ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయి అధికారులే బాధ్యులన్నారు. కస్టోడియన్ అధికారులకు ఇచ్చిన లాగిన్ వారి వద్దనే ఉండాలని, లేకుంటే తొలగిస్తామన్నారు. రైతు సేవా కేంద్రాలు, బయట మార్కెట్‌లో ఎరువుల కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత మండలాల తహశీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీమాలో వందశాతం ఎఫ్‌డిఐ పెంపు అవాంఛనీయం

ఎఐఇఎ పార్వతీపురం యూనిట్ కార్యదర్శి టెక్కలి ధర్మారావు

ప్రజాశక్తి - పార్వతీపురం

బీమారంగంలో వందశాతం ఎఫ్‌డిఐ పెంపు అవాంఛనీయమని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ పార్వతీపురం బేస్ యూనిట్ కార్యదర్శి టెక్కలి ధర్మారావు అన్నారు. కేంద్ర మంత్రివర్గం ఈనెల 12న పలు కార్పొరేట్ అనుకూల ఆర్థిక సంస్కరణలకు ఆమోదం తెలపడం అన్యాయమని అన్నారు. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 100 శాతానికి పెంచడం, అలాగే బీమా చట్టాల సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దేశ ఆర్థిక వ్యవస్థకి గొడ్డలి పెట్టు లాంటిదని చెప్పారు. బీమా రంగంలో ఉపయోగిస్తున్న మొత్తం మూలధనంలో విదేశీ పెట్టుబడుల వాటా కేవలం సుమారు 32 శాతమేనని తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల ప్రయోజనాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. దేశీయ పొదుపులకు విదేశీ మూలధనం ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదని, అలాంటప్పుడు దేశ ప్రజల పొదుపులను విదేశీ మూలధనానికి అప్పగించడం ఆర్థికంగా, సామాజికంగా ఎలాంటి అర్థం లేని చర్యగా అభివర్ణించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించేందుకు యూనియన్ పోరాటం కొనసాగిస్తుందని ధర్మారావు చెప్పారు.

తేజోవతి చేతికి అరకు టిడిపి పగ్గాలు

- నాయకత్వం మార్పుకు శ్రీకారం
- మంత్రి ఆధిపత్యానికి బ్రేక్



ప్రజాశక్తి - పార్వతీపురం

అరకు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి నాయకత్వ పగ్గాలు గిరిజన మహిళా నాయకురాలు, రాష్ట్ర కార్యదర్శి మోజూరు తేజోవతి చేతికి దక్కాయి. గత కొద్ది నెలలుగా పార్టీ నాయకత్వంపై వెలువడుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఇంతవరకు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడిగా కిడారి శ్రవణ్ కుమార్ వ్యవహరించారు. యువకుడు, విద్యావంతుడైనప్పటికీ శ్రవణ్ కుమార్ అరుకు, పాడేరు ప్రాంతానికే ఎక్కువగా పరిమితం కావడం, నాయకులపై నియంత్రణ లేకపోవడంతో అధిష్టానం మార్పు దిశగా అడుగులు వేసింది. ఉన్నత విద్యావంతురాలైన తేజోవతి గత ఎన్నికల ముందు ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లో చేరారు. 2024 ఎన్నికల్లో సాలూరు టిడిపి టిక్కెట్ ఆశించారు. ఆమెకు సీటు ఇవ్వాలని కొంతమంది నాయకులు, కార్యకర్తలు కోరినా అధిష్టానం మాత్రం మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి వైపు మొగ్గు చూపింది. తేజోవతికి పార్టీ పగ్గాలు దక్కడం మంత్రి సంధ్యారాణి కి మింగుడుపడని పరిణామం గా కనిపిస్తోంది. మంత్రి సంధ్యారాణి పనితీరు, నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న రాష్ట్ర నాయకత్వం తేజోవతిని తెరపైకి తీసుకొచ్చినట్టు ఊగాహానాలు వినిపిస్తున్నాయి. పార్టీ సిటింగ్ అధ్యక్షుడు కిడారి శ్రవణ్ కుమార్‌కే మళ్ళీ పగ్గాలు అప్పగించాలని సంధ్యారాణి గట్టిగా ప్రయత్నించారని, కానీ అధిష్టానం ఆమె సిఫార్సులను పక్కనపెట్టి ఆమె వ్యతిరేక గ్రూపునకు చెందిన తేజోవతికి నాయకత్వం అప్పగించడం జిల్లా లో సరికొత్త రాజకీయ సమీకరణాలకు సంకేతంగా మారనుంది. జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆశీస్సులతో రాష్ట్ర కార్యదర్శి నుంచి పార్లమెంట్ పార్టీ అధినేత స్థాయికి ఎదిగిన తేజోవతికి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు వున్నాయి. దీనిపై తేజోవతి ప్రజాశక్తి తో మాట్లాడుతూ తనపై నమ్మకం తో టిడిపి అధిష్టానం అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణ తో, చిత్తశుద్ధి తో నిర్వహిస్తానని చెప్పారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

జీతాల బకాయిలు చెల్లించాలి

మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బకాయి వేతనాలు చెల్లించాలంటూ గ్రీన్ అంబాసిడర్లు జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు ఐదారేళ్లుగా పనిచేస్తున్నప్పటికీ బకాయిలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. అలాగే గ్రామాన్ని చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుతున్న తమకు ఎటువంటి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మెడికల్ అలవెన్స్ రూ.4వేలు ఇవ్వడం లేదని, చెప్పులు, యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బండ్ల మరమ్మతులు చేయించాలని, కొత్త బండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలో కొంతమందికి జీతాలు బకాయిలు బాగా పేరుకుపోయాయని, వాటిని సమగ్రంగా పరిశీలించి ఎంపిడిఒ ఈ పండగ సందర్భంలోనైనా పూర్తిస్థాయిలో బకాయిలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగు నాయుడు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు బెలగాం మహేష్, దోనక సురేషు, జన్ని శ్రీరాము, బొమ్మల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

వైజ్ఞానిక ప్రదర్శనలో ఎమ్మెల్యే జగదీశ్వరి



వైజ్ఞానిక ప్రదర్శనలోని వివరాలను విద్యార్థినిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

చదువుతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు శాస్త్రసాంకేతిక అంశాలపై తయారు చేసిన నమూనాలు, ప్రయోగాత్మక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను ఆసక్తిగా తిలకించిన ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే అన్నారు. ఉపాధ్యాయులు అందిస్తున్న మార్గనిర్దేశం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరింత వినూత్న ఆవిష్కరణలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, ఎంపిడిఒ ఐవి లక్ష్మి, ఎటిడబ్ల్యుఒ రజిని, ఎంఇఒలు చంద్రశేఖర్, బిడ్డిక బీముడు, ఎస్‌ఎంసి చైర్మన్ సొంటేనా రాజేష్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, నాయకులు తాడంగి రామారావు, మహేశ్వర చిన్న, వివిధ పాఠశాలల హెచ్‌ఎం లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం అధ్యక్షతన ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రదర్శన ప్రారంభించారు. విద్యార్థుల మేథస్సు పదును పెట్టడానికి ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కొత్త విషయాలు విద్యార్థులు కనిపెట్టాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంఇఒ సోంబాబు, సంస్కృత ఉపాధ్యాయులు, బౌరోతు శంకరరావు సహకారాన్ని అందజేశారు.

కొమరాడ : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో గల అన్ని జిల్లా పరిషత్ హై స్కూల్లో గల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలు చేసినట్లు ఎంఇఒ జామి నారాయణస్వామి తెలిపారు. వీరి ప్రతిభ మేరకు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన గ్రూపులను జిల్లాస్థాయికి ఎంపిక చేశామన్నారు. ఎంపిడిఒ ఎస్‌రమేష్ విద్యార్థులకు పలు సూచనలు చేసి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

అఖిల భారత పింఛనుదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కురుపాం తాలూకా అధ్యక్షులు టి.పాండురంగ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాన్ని ఐ కేంప్ పుష్పగిరి ఆసుపత్రి, విజయనగరం వారి సహకారంతో నిర్వహించనున్నామని, కావున పింఛను దారులు, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మెరుగైన సేవలందించాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రజారోగ్య కార్యక్రమాలను పక్కగా అమలు చేసి మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఆశా నోడల్ అధికారులతో ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆరోగ్యకార్యక్రమాల అమలు తీరు, వైద్య సేవలపై సమీక్ష జరిపారు. మాతా, శిశు నమోదు శాతం పెంచాలని, త్వరితంగా గర్భిణుల నమోదు, పరీక్షలు జరిపి హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. నిర్ణీత సమయంలో తనిఖీలు, వైద్య పరీక్షలు జరిపించి ప్రసవానంతరం వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించి తగు సూచనలు చేయాలన్నారు. కిల్కారీ వాయిస్ కాల్స్ సూచనలను ప్రతీ గర్భిణు, బాలింతలు ఆచరించేలా అవగాహన కల్పించాలన్నారు. శిశువులో శ్వాస సంబంధిత సమస్యలు గుర్తించే శాన్స్ సర్వే జరిగేలా చూడాలన్నారు. మాతా, శిశు మరణాలు జరగకుండా సమష్టి కృషి చేయాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌సిడి సర్వేలో క్యాన్సర్ లక్షణాలు గుర్తించి వైద్యాధికారి ద్వారా అవసరమైన వారిని పిఒయుకు చేరేలా కార్యాచరణ చేయాలన్నారు. స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ నెలాఖరుకు పూర్తి చేసి 4డి లు గుర్తించాలన్నారు. లెప్రసీ సర్వేలో గుర్తించిన లక్షణాలున్నవారికి తగు చికిత్స అందేలా చూడాలన్నారు. ఈనెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై మండల, గ్రామీణ స్థాయిలో సమన్వయ సమావేశాలు జరపాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో డిఐఒ డాక్టర్ విజయమోహన్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కెవిఎస్.పద్మావతి, ఎన్‌సిడి పిఒ డా టి.జగన్ మోహనరావు, డిపిఒ లీకారాణి, డిసిఎం విజయలత, హెల్త్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానం : డిఇఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జనవరి 2026లో జరగబోయే టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డిఇఒ పి.బ్రహ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోయర్, హైయర్ గ్రేడ్ డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వేవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన సంస్థల నుంచి ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. గతంలోనే లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు కూడా హైయర్ పరీక్షలు రాయడానికి అర్హులని తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు ఫీజ్ రూ.100, హయ్యర్ గ్రేడ్ కు రూ. 150 చెల్లించాలన్నారు. అలాగే హ్యాండ్లూమ్ వేవింగ్ లోయర్‌కు రూ.150కు, హయ్యర్ రూ. 200, టైలరింగ్, ఎంబ్రాయిడరి లోయర్‌కు రూ.150, హయ్యర్ రూ.200గా నిర్ణయించారు. అభ్యర్థులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పరీక్ష రుసుం, డౌన్ లోడ్ చేసిన దరఖాస్తు ఫారాన్ని ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 27లోగా సమర్పించాలని సూచించారు. రూ. 50 అపరాధ రుసుంతో జనవరి 3లోగా, రూ.75, అపరాధ రుసుంతో జనవరి 6లోగా సమర్పించాలని తెలిపారు. నామినల్ రోల్స్ జనవరి 10న సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు www.bse.ap.gov.inలో చూసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

'కౌశల్' విజేతలకు బహుమతులు ప్రదానం

రాష్ట్రస్థాయికి 12 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

భారతీయ విజ్ఞానమండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్ కాస్ట్), సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కౌశల్ ఆన్‌లైన్ పోటీల జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక డివిఎం హైస్కూల్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డిఇఒ బ్రహ్మాజీ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రథమ బహుమతులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1500, ద్వితీయ బహుమతి రూ.1000 చొప్పున నగదు బహుమతులను అందించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులు పొందిన 12 మంది విద్యార్థులు ఈ నెల 27న తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరగనున్న రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ కోట అయ్యప్ప, అకాడమీ కోఆర్డినేటర్ బెహరా సంతోష్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ జి.లక్ష్మణరావు, ఎంఇఒ కర్రి ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు పింఛనర్ల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అఖిలభారత పింఛనుదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదార్ల సమావేశ మందిరంలో నెలవారీ సమావేశం జరుగుతుందని, ఇందులో భాగంగా పింఛనుదారుల ఆశాజ్యోతి ధరం స్వరూప్ నకారా విగ్రహావిష్కరణ కూడా జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గంట జగన్నాధం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.



రంగులతో ముస్తాబైన వనంగుడి

సుందరంగా వనం గుడి ముస్తాబు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో జనవరి 26,27,28 తేదీల్లో జరుగనున్న పోలమాంబ అమ్మవారి జాతరకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గోముఖీ నది అవల ఉన్న వనం గుడిని, తెర్లాం మండలం ఆమిటి గ్రామానికి చెందిన సత్యనారాయణ భక్తుడు అమ్మవారి విగ్రహానికి, గుడికి రంగులు దిద్దుతున్నారు. తాను కోరుకున్న కోర్కెలు నెరవేరినందున ఈ మొక్కును ఆయన చెల్లించుకుంటున్నట్లు చిత్రకారులు చెబుతున్నారు. రంగులు వేసి అలంకరణ చేసే పనుల్లో రాత్రి పగలు చిత్రకారులు శ్రమిస్తున్నారు.



ఆశా, సిహెచ్‌డబ్ల్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఇందిర

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు నాయకులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కూనేరు రామభద్రపురం పిహెచ్‌సి వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను కట్టపెట్టేందుకు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అని అలాంటి సిఐటియు అఖిలభారత మహాసభలు మొట్టమొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్ల, మండల నాయకులు ఉమా, ఎల్లమ్మ, పార్వతి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు అక్కమ్మ, పార్వతి తదితరులు ఉన్నారు.

18న మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గ్రామ జంక్షన్ వద్ద గల శ్రీ షిరిడి సాయిబాబా ధ్యాన మందిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సౌజన్యంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న 35వ మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక కంటి సమస్యతో బాధపడుతున్న వారు ఆధారు, మొబైల్, తదితరమైన గుర్తింపు కార్డులు తమ వెంట తీసుకురావాలని కోరారు.

బాధితులకు సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బాధితులకు సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్లా హరిబాబు, చింతా ఉమామహేశ్వరరావు, జామి సింహాచలం, తూముల రమేష్, జి.గౌర్నాయుడు, జంపు చంద్రశేఖర్, సిహెచ్ శ్రీనివాసరావు, వి.భాస్కరరావు, కె.ధర్మారావు, తదితరలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - కురుపాం

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి పి.శ్రీధర్ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ నిర్మూలనకు బాల వివాహ ముక్తభారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. అనంతరం బాలల హక్కులు, రక్షణ చట్టాలు గురించి వివరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఇఒలు సత్యనారాయణ, రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మూడు రోజుల్లో స్వామిత్వ సర్వే పూర్తి చేయాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో 100 శాతం సర్వే పూర్తి చేసి డిసెంబర్ నెలాఖరుకల్లా ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధం అమలు చేసి గ్రామాల్లో చెత్త కుప్పలు తొలగించి క్లీన్, గ్రీన్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. అలాగే ముస్తాబు కార్యక్రమంపై గ్రామాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించి ప్రతి సర్వేను పూర్తిగా నిర్వహించాల్సిందేనని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు.

డిఐఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి వై.నాగేశ్వరరావు స్థానిక ప్రభుత్వ జూనియర్ (బాలురు, బాలికల) కళాశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. జంబ్లింగ్ పద్ధతిలో జరుగుతున్న పరీక్షల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యాపకుల, సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించారు. కళాశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి చెందారు. మధ్యాహ్న భోజనం జరుగుతున్న తీరును విద్యార్థులను అడిగి వారి ఇచ్చిన సమాధానం విని సంతృప్తి చెందారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతాఉత్తీర్ణులు కావాలన్నారు. స్టడీ అవర్స్ గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ వి.హరిగోపాల్, సీనియర్ అధ్యాపకులు వెలమల అప్పారావు, గోవిందరావు, వెంకటరమణ,, విజయ్ కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

చెత్త సంపదపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

చెత్త సంపద కేంద్రాల ద్వారా ఆర్థిక సేకరణకు ప్రజలు సహకరించాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని నిడగల్లులో ఎస్‌డబ్ల్యూబిసి కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం చెత్త బండి ద్వారా చెత్త సేకరణ హరిత మిత్రలకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటిలో ఉండే చెత్త బయటకు వేయకుండా ఒక బుట్టలో వేసి తడి, పొడి చెత్తను వేరువేరేగా వేసి ఎస్‌డబ్ల్యుసి కేంద్రాల ద్వారా వేయాలని వాటి వేయాలన్నారు. వాటి ఆదాయాన్ని తయారు చేసుకుని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పి.ధనలక్ష్మితో పాటు ప్రజలు పాల్గొన్నారు.



చెత్త చంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి : జెసి

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠ్యాంశాల బోధనలో నాణ్యతను పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ సూచించారు. మండలంలోని మొండెంఖల్లులో గల గిరిజన సంక్షేమ ఆశ్రమఉన్నత పాఠశాలను జెసి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, విద్యార్థుల హాజరు, భోజన నాణ్యత, వసతి సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. తరగతుల్లో బోధన విధానాన్ని పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా స్థాయి గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం దుడ్డుకల్లు పిహెచ్‌సిని సందర్శించిన జేసీ అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, మౌలిక వసతులను పరిశీలించారు. కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని, రోగులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, సమయానికి చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం కురుపాంలోని పెట్రోల్ బంకును జెసి తనిఖీ చేశారు. ఇంధన నాణ్యత, మీటర్ల ఖచ్చితత్వం, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఇంధనం సరఫరాలో ఏవైనా అక్రమాలు జరుగుతున్నాయా అనే అంశంపై సిబ్బందిని ప్రశ్నించారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు సక్రమంగా ఉంచాలని ఆదేశిస్తూ, వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్శనలో సంబంధిత వైద్య శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కెలు కాదు.. మిల్లర్ల సేవా కేంద్రాలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అన్ని గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాలు మిల్లర్ల సేవా కేంద్రాలుగా పనిచేస్తున్నాయని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ధాన్యం నాణ్యత లోపం వల్ల కొనుగోలు ధరలు తగ్గుతున్నాయని, రైతులను తప్పుదోవపట్టే రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బూరాడ రామమోహన్ అలియాస్ రవి చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. నాణ్యతా లోపం మిల్లుల్లో మాత్రమే ఉందని, రైతు పండించే పంటల్లో లేదని చెప్పారు. రైతులు మిల్లర్లకు అందించే ధాన్యంలో అనేక షరతులను చూపించి 80 కేజీల బస్తాకు ఐదు కేజీలు ధాన్యం అదనంగా తీసుకుంటార న్నారు. ధాన్యంలోనే నాణ్యతా లోపం ఉందని మిల్లర్ల అసోసియేషన్ భావిస్తున్నట్లయితే రైతులతో పాటు ఎపి రైతు సంఘం బహిరంగ చర్చకు సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. మిల్లుల్లో ఆధునిక యంత్రాలు, తేమ నిర్ధారణ యంత్రాలు మండలంలో ఏ మిల్లు వద్దా లేవన్నారు. ఇటీవల మండలంలోని రైస్ మిల్లులపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి అదనంగా 80 కేజీలకు ఐదు కేజీలు ధాన్యం తీసుకుంటున్నట్లు రుజువైనా మిల్లులపై చర్యల్లేవన్నారు. రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షులు బూరాడ రవి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో దోపిడీకి పాల్పడుతున్న తన రెండు రైస్ మిల్లుల వద్ద ఎపి రైతు సంఘం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుం దని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.సింహాద్రి నాయుడు పాల్గొన్నారు

జీతాల్లేక మున్సిపల్ కార్మికుల ఆందోళన

అధికారుల నిర్లక్ష్యంపై యూనియన్ నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కార్మికులకు జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నవంబర్ నెల జీతాలు నేటికీ చెల్లించకపోవడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను కలిసి జీతాల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరగా ఆయన బడ్జెట్ లేదు అని ఏకైక సమాధానం చెప్పినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. నవంబర్ జీతాలకే ఈ పరిస్థితి ఉంటే, డిసెంబర్ నెల జీతాలు కూడా జనవరికి ఇదే బడ్జెట్ లేదు అనే సాకుతో ఆలస్యం చేసే అవకాశం ఉందని కార్మికులు ఆందోళన చెందుతున్నారాని తెలిపారు. కార్మికుల పట్ల అధికారులు, పాలకవర్గం అనుసరిస్తున్న ఈ వైఖరి సరికాదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. కార్మికులు నిరంతరం పట్టణ పారిశుద్ధ్యాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నా వారి కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని సకాలంలో ఇవ్వకపోవడం దారుణమని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కమిషనర్ రత్నకుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు. తక్షణమే ఈ



మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు వినతిని అందజేస్తున్న కార్మికులు

సమస్యపై చర్చించి, కార్మికుల జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించడంలో పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే, కార్మికులు చేపట్టే ఆందోళనలు, పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని యూనియన్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కమిటీ సభ్యులు టి.రవి, టి.శంకర్రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పంటలు పాడవ్వకుండా రోడ్డు పనులు చేపట్టాలి

కాంట్రాక్టర్ తీరుపై రైతులు ఆవేదన

ప్రజాశక్తి - కొమరాడ

రైతులకు ఇబ్బందుల్లేకుండా రోడ్డు పనులు చేపట్టారు తప్ప రైతులకు, ప్రజలకు ఇబ్బందులు పెట్టేలా పనులు చేయకూడదని అర్తాం, సీతామాంబాపురం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గుణానపురం, బిటి రహదారి నుంచి అర్తాం, సీతామాంబాపురం గ్రామానికి జరుగుతున్న రోడ్డు పనుల వల్ల రైతుల ఇబ్బందులు పడడంతో మంగళవారం రోడ్డు పనులను అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ తనకు నచ్చినట్టు వ్యవహరించి మట్టిని రోడ్డుపైన వేయకుండా దిగువ ఉన్న పంట పొలాలపై వేయడంతో ఆందోళన చేసి పనులు అడ్డుకున్నారు. రోడ్డు ఎంతవరకు ఉందో ఆ మేరకే పనులు చేయాలి తప్ప రైతులు పంట పొలాలపై మట్టి వేయడంపై ధ్వజమెత్తారు. సుమారు రూ.56 లక్షలతో చేపడుతున్న రోడ్డు పనులను నాణ్యత లేకుండా చేపడుతున్నారని విమర్శించారు. ఇటీవల చేసిన కల్వర్టు పనులు నాసిరకంగానే చేపట్టారన్నారు. అయినా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమను ఇబ్బంది పెట్టే కాంట్రాక్టర్ తీరుపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని ఆ గ్రామ రైతులు తెలిపారు.

వాడీ వేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి - సీతంపేట

మండల సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో వాడీవేడిగా జరిగింది. ఎంపిపి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత తహశీల్దార్ సుకన్య మాట్లాడుతూ నెలరోజుల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పగా, శంభాం సర్పంచ్ నిమ్మక తిరుపతిరావు మాట్లాడుతూ డికెడి పట్టాలు, వన్‌బిలు రావడంలేదని, ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని ధ్వజమెత్తారు. స్మార్ట్ రేషన్ కార్డులు ఇంకా పంపిణీ చేయలేదన్నారు. ముటేషన్ల పేర్లు మార్పులు, చేర్పులు జరగడంలేదని తెలిపారు. ఉపాధి వేతనాలు నెలలు తరబడి అందడం లేదని ధోనుభాయి సర్పంచ్ వెంకీనాయుడు, ధారపాడు జె.సుందరమ్మ అధికారులను నిలదీశారు. పనులు జరిగే చోట ప్రథమ చికిత్స బాక్సులు ఉండడం లేదన్నారు. దీనిపై ఎపిఒ సాగర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. అనంతరం ఎంపిపి ఆదినారాయణ మాట్లాడుతూ ఆ సమస్యలు తక్షణమే పరిష్కారం కావాలన్నారు. ధోనుబాయి పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని సర్పంచ్ వెంకినాయుడు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వెలుగు ద్వారా



సమస్యలను వివరిస్తున్న సర్పంచ్

రుణాలు అందజేస్తామని ఎపిఎం కమల కుమారి తెలిపారు. పశుసంవర్ధశాఖ ద్వారా పశువులు రుణాలు ఉంటాయని ఎడి శ్రీనివాసరావు చెప్పారు. ట్రైబల్ వెల్ఫేర్ డిఇ నాగభూషణం అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపిపి కె.సరస్వతి, ఎంపిడిఒ మిశ్రా, డిప్యూటీ ఎంపిడిఒ మోహన్‌రావు, ఎఒ వాహిణి, సిడిపిఒ సిమ్మలమ్మ, డిఇ నాగభూషణం, ఎంఇఒ ఆనందరావు, ఎఇ వెంకటేష్, కిరణ్, హెచ్‌ఒ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యు.వెంకంపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి సచివాలయం పరిధి యు.వెంకంపేటలో మంగళవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, మధుమేహం, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని రకాల సేవలూ అందించాలి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఎప్పటికప్పుడు చేపట్టాలని తహశీల్దార్ నిమ్మక శేఖర్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలన్నారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్స్,ఎపి సేవా క్యాస్ట్, ఇన్ కమ్, ఎఫ్ఎంసి, హౌసింగ్, మ్యుటేషన్, అడంగల్ కరెక్షన్స్, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలకు అందుబాటులో ఉంటూ, సత్వరమే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

250 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీ సత్య సాయి ధ్యాన మందిరంలో మంగళవారం విజయనగరానికి చెందిన శ్రీసాయి సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో వైద్యులు ఎ.శ్రీరామ్మూర్తి, కిషోర్, లహరి 250 మందికి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీళ్ల నొప్పులు, తదితర కేసులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకుకూరలు ఎక్కువగా తినాలని పలు సూచనలు, సలహాలు అందజేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి సత్యసాయి మందిరంలో ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించనున్నామని వారు తెలిపారు. ఆసుపత్రికి వైద్యం కోసం తరలించినప్పుడు వాహనానికి రూ.300 రుసుము చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి మందిర నిర్వాహకులు జి.మురళీకృష్ణ, ఎ.వెంకటరావు, కె.సన్యాసినాయుడు, అల్లం కృష్ణబాబు, రోగులు పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు

ప్రజాశక్తి - సీతానగరం

జీరో బడ్జెట్లో సాగు చేస్తే సత్ఫలితాలు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆర్.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని చినభోగిలిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోసిన తర్వాత పొలంలో వరి కొయ్య కాళ్లు ఉండగానే దుక్కి దున్నకుండా చదును చేసుకుని మొక్కజొన్న విత్తనాలను నేరుగా విత్తడాన్ని జీరో టిల్లెజ్ అంటారని తెలిపారు. ఈ పద్ధతి ద్వారా వరి చేనులో మొక్కజొన్న సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారని, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగాను ఉపయోగపడుతుండడంతో రైతులు అధిక విస్తీర్ణంలో పండిస్తూ లాభాలు గడిస్తున్నారని తెలిపారు. అలాగే సాగు ఖర్చులు తగ్గించుకొని సమయాన్ని ఆదా చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నాంని, తక్కువ విత్తనంతో అధిక దిగుబడి అందుతుందని తెలిపారు. రబీలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉండడంతో వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగును ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగా జీరో టిల్లేజ్ పద్ధతిపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. నీటి ఆదా అవ్వడంతో పాటు, వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చున్నారు. ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ కలుపును సకాలంలో నివారిస్తే రైతులు లాభాలు పొందవచ్చు అని తెలిపారు.అలాగే కత్తెర పురుగు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుందని, దీని నివారణకు రైతులు ఒక లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె పిచికారీ చేయడం వల్ల పురుగు ఉధృతి తగ్గించి దిగుబడి సాధ్యమని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతులు బి.అప్పారావు, సామినాయుడు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బట్టిమొగలివలసలో 'మా ఊరికి మలేరియా వచ్చింది'

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గిరిజన గ్రామమైన బట్టిమొగలివలసలో 'మా ఊరికి మలేరియా వచ్చింది అనే కార్యక్రమాన్ని మండల అధికారుల బృందం చేపట్టారు. గ్రామానికి అధికారులు వెళ్లి గ్రామంలో మలేరియా బాధితుల కుటుంబ సభ్యుల పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్.రమేష్ మాట్లాడుతూ గ్రామంలో మలేరియా సోకినట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. వెంటనే మండల స్థాయి అధికారులకు తెలియజేసి మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మా ఊరుకి మలేరియా వచ్చింది అనే కార్యక్రమాన్ని కొమరాడ వైద్య అధికారి శిరీష ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనారోగ్యం లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ వివిధ రక్తపరీక్షలు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. గ్రామమంతా ఐఆర్ఎస్, ఎఎంసి, దోమల మందు పిచికారీ చేయించారు. ట్రైబల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అంగన్వాడీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్నం భోజనం పథకాన్ని పర్యవేక్షణ చేసి పలు సూచనలు సలహాలు అందజేశారు. గ్రామంలో తాగునీరు నమూనాలను తీసుకొని నీటి పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారుల బృందం మాట్లాడు తూ గ్రామాల్లో ఎటువంటి అనారోగ్యాల బారినపడ్డా తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవసరమైన వారు వైద్య చికిత్సలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి వార్డూ స్వచ్ఛత కావాలి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ప్రతి వార్డులను ప్రజలు స్వచ్ఛత వార్డుగా తీర్చిదిద్దుకోవాలని కమిషనర్ టిటి రత్నకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక 12వ వార్డులో స్వచ్ఛత అవార్డుగా గుర్తించి స్థానిక మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇంటి నుంచి వచ్చిన వ్యర్థాలను కాలువల్లో పారబోయకుండా తమ ఇంటికి వచ్చిన పారిశుధ్య కార్మికునికి తడి, పొడి చెత్తలను వేరుచేసి అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను ఉపయోగించాలని, ప్లాస్టిక్ వల్ల అనర్థాలకు దారితీస్తుందని తెలిపారు. వార్డుల్లో ఉన్న షాపుల్లో, హోటల్లో తప్పకుండా చెత్తబుట్టలను ఏర్పాటు చేసి తమ షాపుల నుంచి వచ్చిన వ్యర్థాలను డెస్ట్ బిన్లలో వేసి పురపాలక సంఘ వాహనానికి అందించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రతంగా ఉంచుకుంటూ దోమలు, క్రిమి కీటకాలు వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ, సచివాలయ శానిటరీ సెక్రటరీ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు బాగు

బిటి రోడ్డు వేయాలని గిరిజను ల డిమాండ్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠపురం పంచాయతీ మామిడి మానుగూడ నుంచి పొక్కిరి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా దెబ్బతినడంతో మంగళవారం గిరిజనులు స్వయంగా శ్రమదానంతో రోడ్డు బాగు చేసుకుంటున్నారు. గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరికి ఎన్నిసార్లు వినతి అందించినప్పటికీ స్పందన లేదని గిరిజన సంఘం నాయకులు బిడ్డిక వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్య, వైద్యం, రవాణా సహా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా శ్రమదానంతో రహదారిని సరిచేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మామిడి మానుగూడ నుంచి పొక్కిరి వరకు వెంటనే బిటి రోడ్డు మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో గిరిజనులందర్నీ కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మామిడిగూడకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రమదానంతో రోడ్డును నిర్మించుకుంటున్న గిరిజనులు

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాలిటీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, సిరిసిపల్లి సాయిశ్రీనివాస్, ఎస్సీ సెల్ ఛైర్మన్ కోలా కిరణ్ కుమార్ తదితరులు మంగళ వారం మున్సిపల్ కమిషనర్ కె.కిషోర్ కుమార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీలో కొంతకాలంగా కొన్ని సమస్యలు వేధిస్తున్నాయని, ముఖ్యంగా ప్రతిరోజూ తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని అన్నారు. ఏడాదిలో సగం రోజులకు పైగా రంగు మారిన నీరు ఇస్తున్నారని, సమయపాలన పాటించడంలేదని అన్నారు. అలాగే చెత్త డంపింగ్ యార్డ్ సమస్య వేధిస్తోందని, తగినంతమంది సిబ్బందిని నియమించి మున్సిపాలిటీలో 24/7 పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని కోరారు. మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగుతీత పనులు చేపట్టకపోవడంతో ఏ మాత్రం వర్షం పడ్డా మెయిన్ రోడ్డు చెరువవు తోందని, అలాగే మున్సిపాలిటీలోని చెరువులు, వరహాలు గెడ్డ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని అన్నారు. ఆక్రమణలు తొలగించి వాటిని రక్షించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తోటపాలెంలోని సత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం ఆరో రోజు సందర్భంగా మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలోని పశువులకు ఉచిత వైద్య పరీక్షలు, టీకాలు, పురుగుల నివారణ మందులు అందించారు. ఈ సందర్భంగా వెటర్నరీ వైద్యులు డాక్టర్ మోహన్ గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరప నాయుడు, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సమాజంలో ప్రతి వ్యక్తికి జీవించే హక్కు ఉందని విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం విజయనగరం మండల పరిషత్ సమావేశ మందిరంలో మెడికల్ అండ్ హెల్త్ ఆధ్వర్యంలో 18 ఏళ్లలోపు బాల బాలికలపై లైంగిక దాడులు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపిపి మాట్లాడుతూ పిల్లలకు గుడ్ టచ్ బ్యాక్ టచ్‌పై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. ఎంపిడిఒ గంటా వెంకట్రావు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అఖిల, డాక్టర్ కార్తీక్, సైకాలజిస్టులు ఉదయ్ కుమార్, ఎస్‌వి రమణ, బాలల సత్వర చికిత్స కేంద్ర కౌన్సిలర్ కొండమ్మ, డిఇఐ సిసోషల్ వర్కర్ శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, చైల్డ్ ప్రొటెక్ట్ ఆఫీసర్లు, వెలుగు ఎపిఎం పలగర అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఎ రాష్ట్ర కార్యదర్శిగా సూరిబాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా చిప్పాడ సూరిబాబు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎం.మురళీ ఎన్నికయ్యారు. ఎన్‌టిఎ రాష్ట్ర నాయకులుగా ఎన్నికైన నాయకులకు జిల్లా అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు.

గిరిజన యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చాకలిగూడకు చెందిన సవర ప్రేమ్ కుమార్ (23) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం చాకలిగూడ చెందిన ప్రేమ్ కుమార్ అన్నయ్య శాంత్ కుమార్, తాతయ్య గోపాల్, నాన్నమ్మ చుక్కమ్మ, వదిన అంతా కలిసే ఉంటున్నారు. అయితే మంగళవారం తాతయ్య గోపాల్ కొండపోడికు రమ్మని ప్రేమ్ కుమార్‌ను పిలవగా, తాను రానని చెప్పాడు. అన్నయ్య కొడుకు బాగోలేదు పాలకొండ ఆసుపత్రికి తీసుకొని వెళ్లి చెప్పారు. దీంతో తాత, మనవడికి వాగ్వివాదం చోటుచేసుకుంది. క్షణకావేశంలో సంచిలో ఉన్న కత్తి తీసుకొని పీక కోసుకున్నాడు. వెంటనే ప్రేమ్‌కుమార్ మెట్ల మీద పడటంతో గ్రామస్తులు ఆటోలో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకొని వెళ్లేసరికి మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు సోదరుడు శాంత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తండ్రి రాజేష్, తల్లి వెంకటమ్మ 12 ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని 16వ వార్డు పరిధిలోని కుమ్మరి వీధికి చెందిన ద్రాక్షవరపు రాంబాబు (36) భవాని మాల వేసుకుని అమ్మవారి మొక్కు తీర్చుకుని తిరిగి వస్తుండగా ఈనెల 13న ప్రత్తిపాడు జంక్షన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. పాలకొండ నుంచి భవాని భక్తులంతా ప్రత్యేక వాహనంలో విజయవాడకు వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో బహిర్భూమికి వెళ్లిన రాంబాబును గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పాలకొండ 16వ వార్డు కౌన్సిలర్ కడగల వెంకటరమణ సోమవారం రాత్రి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. శవ పంచినామా తదితర ప్రక్రియలు పూర్తిచేసుకుని మంగళవారం మృతదేహాన్ని పాలకొండకు తీసుకొచ్చారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషాద సంఘటనలో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.